

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...


రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి
నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది.
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ,
మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా
పని చేయుటకు ఆసక్తి, అనుభవం
ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్
చేసి సంప్రదించగలరు.

Contact Number
9059328777

రంగారెడ్డి మంగళవారం 07-04-2026 సంపుటి: 01 సంచిక : 291 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Tuesday, 07-04-2026 Volume :01 Issue: 291 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani



## ఢిల్లీ అసెంబ్లీలో భద్రతా వైఫల్యం

- ఇనుప గేటును ధ్వంసం చేస్తూ దూసుకెళ్లిన కారు
- కారు సీజ్..నిందితుడి అరెస్టు

న్యూఢిల్లీ

ఢిల్లీ అసెంబ్లీ వద్ద భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. మాస్క్ ధరించిన ఓ వ్యక్తి వేగంగా కారు నడుపుతూ అసెంబ్లీ గేటును ఢీకొట్టి లోపలికి దూసుకెళ్లాడు. అనంతరం స్పీకర్ విజయేందర్ గుప్తా కార్యాలయం బయట పుష్పగుచ్ఛం ఉంచి, కారుపై సిరా విసిరి..అదే కారులో పరారయ్యాడు. వాహనానికి ఉత్తర్‌ప్రదేశ్ రిజిస్ట్రేషన్ ప్లేటు ఉందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఈ ఘటన జరిగిందని చెప్పారు. వాహనం కోసం గాలింపు చర్యలు ప్రారంభించిన ఢిల్లీ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలోనే ఫోరెన్సిక్ బృందంతో పాటు బాంబు స్క్వాడ్ అసెంబ్లీలో తనిఖీలు చేపట్టాయి. పుష్పగుచ్ఛంలో ఏమీ లభ్యం కాలేదని అధికారులు తెలిపారు.

-మిగతా 2 లో

# హామీలు నెరవేరుస్తున్నాం



- ప్రతి రెండు నెలలకోసారి వస్తాం.. నిధులు ఇస్తాం
- బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి
- తుమ్మిడిహెట్టి, ప్రాణహిత నిర్మాణానికి సర్వే : పిప్రి గ్రామ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- రూ.225 కోట్లతో బాసర సరస్వతీ ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

### మేం పాలకులం కాదు.. ప్రజా సేవకులం

ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి ఏప్రిల్ 6: (నేటి దర్శిని)
రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పాలకులుగా కాకుండా ప్రజా సేవకులుగా పని చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన తీసుకురావడానికి చేసిన పోరాటంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం సీఎం పర్యటనలో భాగంగా నిర్మల్ జిల్లా బాసరలో రూ. 225 కోట్లతో జ్ఞాన సరస్వతి ఆలయం పునర్నిర్మాణ పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. మనుమడికి ఆలయంలో అక్షరభ్యాసం చేయించారు. అనంతరం రూ. 1,250 కోట్లతో బోథ్ నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత బజార్‌హత్నూర్ మండలం

-మిగతా 2 లో

ఆదిలాబాద్ ప్రజల గుండెల నిండా అభిమానం






## వర్షం కారణంగా కేకేఆర్, పీబీకేఎస్ మ్యాచ్ రద్దు

- ఐపీఎల్ 2026లో తొలి 'వాష్ అవుట్'
- 3.4 ఓవర్లకే ముగిసిన ఆట..
- ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: (నేటి దర్శిని)
ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో తొలిసారిగా ఓ మ్యాచ్ వర్షార్పణం అయింది. సోమవారం కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే ఈ మ్యాచుకు వర్షం అంతరాయం ఏర్పడింది. కేకేఆర్ బ్యాటింగ్ చేస్తుండగా 3.4 ఓవర్లలో 25/2 పరుగులు వద్ద వర్షం అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత వాన మళ్లీ తగ్గలేదు. దీంతో అంపైర్లు మ్యాచును రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు.ఈ మ్యాచులో తొలుత టాస్ గెలిచిన కోల్‌కతా నైట్ రైడర్స్ బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే ఇన్నింగ్స్ 3.4 ఓవర్ల వద్ద వర్షం ఎంట్రీ ఇచ్చింది. దీంతో ఇరు జట్ల ఆటగాళ్లు మైదానాన్ని వీడారు.

-మిగతా 2 లో




## 9 మంది పోలీసులకు ఉరిశిక్ష..

- తండ్రీకొడుకుల లాకప్ డెత్ కేసులోమదురై కోర్టు సంచలన తీర్పు

మదురై:
తండ్రీ కొడుకుల లాకప్ డెత్ కేసులో తొమ్మిది మంది పోలీసులకు ఉరిశిక్ష విధిస్తూ తమిళనాడులోని మదురై మొదటి తరగతి జిల్లా, సెషన్స్ కోర్టు సోమవారం సంచలన తీర్పు చెప్పింది. అలాగే వారికి రూ.కోటి జరిమానా విధించింది. బాధిత కుటుంబానికి ఆ మొత్తం చెల్లించాలని ఆదేశించింది. కొవిడ్ సమయంలో తమ దుకాణాన్ని తెరచి ఉంచారన్న ఆరోపణలపై జయరాజ్, అతని కుమారుడు బెనిక్స్‌ను తుత్తుకూడి జిల్లా సాతన్‌కుళం పోలీసులు 2020 జూన్ 19న స్టేషన్‌కు తీసుకు వచ్చారు.ఆ రోజు రాత్రంతా వారిని చితకబాది మరునాడు కోవిపట్టి సబ్‌జైల్‌కు తరలించారు. తీవ్ర గాయాలతో కోవిపట్టి ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతూ బెనిక్స్ జూన్ 22న మరణించగా, అతని తండ్రి జయరాజ్ ఆ మరునాడు కన్నుమూశాడు.

-మిగతా 2 లో

## పాములు, మొసళ్లతో సరిహద్దు కాపలా!..



### అక్రమ చొరబాట్లను అడ్డుకునేందుకు బీఎస్ఎఫ్ యోచన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: (నేటి దర్శిని)
భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులో చొరబాటుదారులను నిరోధించడానికి పాములు, మొసళ్లను వినియోగించాలని సరిహద్దు భద్రతా దళ (బీఎస్ఎఫ్) వర్గాలు యోచిస్తున్నాయి. నదీతీర, చిత్తడి నేలల్లో చొరబాట్లను నిరోధించడానికి ఒక సహజ నిరోధంగా వీటిని వినియోగించాలని ఈ యోచన చేస్తున్నారు. భారత్, బంగ్లాదేశ్ సరిహద్దులో సంప్రదాయ ఫెన్సింగ్ వేయడానికి వీలుకాకుండా బలహీనమైన ప్రదేశాలు ఉన్నచోట వీటిని ఉంచాలని భావిస్తున్నారు. కాగా, 4,096 కి.మీ పొడవున ఉన్న సరిహద్దులో 175 కి.మీలు నదీతీర, చిత్తడి నేల ప్రాంతాలు

-మిగతా 2 లో

## తాత్కాలిక సంధికి నో!

### యుద్ధానికి శాశ్వత ముగింపు కావాలి

- ట్రంప్ కాల్పుల విరమణ ప్రతిపాదనను తిరస్కరించిన ఇరాన్
- యుద్ధం ముగింపునకు 10 డిమాండ్లు
- పాకిస్థాన్ ద్వారా అమెరికాకు చేరవేత
- ఇరాన్ నిర్ణయంపై ట్రంప్ అసంతృప్తి
- భారీ మూల్యం తప్పదని హెచ్చరిక
- ఒక్క రాత్రిలో ఇరాన్ మొత్తాన్ని నాశనం చేస్తామని వార్నింగ్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: (నేటి దర్శిని)
అమెరికా నుంచి వచ్చిన కాల్పుల విరమణ ప్రతిపాదనను ఇరాన్ సోమవారం తిరస్కరించింది. తన ప్రతిస్పందనను పాకిస్థాన్ ద్వారా అమెరికాకు తెలియచేసినట్లు ఇరాన్ అధికారిక వార్తాసంస్థ ఇస్లామిక్ రిపబ్లిక్ న్యూస్ ఏజెన్సీ(ఇర్నా) తెలిపింది. తాత్కాలిక ఒప్పందానికి ఇరాన్ ఇష్టపడడం లేదని, యుద్ధానికి శాశ్వత ముగింపు అవసరమని

-మిగతా 2 లో

## చందమామ చెంతకు ఆర్టెమిస్-2

- నేడు తిరుగు ప్రయాణం..
- 10న ల్యాండింగ్

2 లో





## ఫుడ్‌సేఫ్టీ కోసం ప్రత్యేక వ్యవస్థ

- రంగంలోకి 24 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు
- ఐదు మొబైల్ ఫుడ్ టెస్టింగ్ వాహనాలు
- రూ.15 కోట్లతో 3 కొత్త రీజినల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ

హైదరాబాద్ ఏప్రిల్ 6: (నేటి దర్శిని)
డ్రగ్స్ నిర్మూలనకు ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్టుగా, ఫుడ్ సేఫ్టీ కోసం ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం సంకల్పించారని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ తెలిపారు. శాస్త్రీయ అధ్యయనం అనంతరం, త్వరలోనే ఒక కొత్త వ్యవస్థను అమల్లోకి తీసుకొచ్చి.. ఆహార కల్తీ కేటుగాళ్లపై పీడీ యాక్ట్ వంటి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

-మిగతా 2 లో

# కాంగ్రెస్ పార్టీకి పాకిస్థాన్‌తో దోస్తీ

### 'కాంగ్రెస్ గెలవాలని పాక్ కోరుకుంటోంది'

- పాక్ స్క్రిప్ట్‌తోనే ప్రతిపక్షాల ప్రెస్ మీట్లు
- ఆపరేషన్ సింధూర్ సమయంలో కూడా కాంగ్రెస్ పార్టీ పాకిస్థాన్ పాటే పాడింది
- అస్సాం గడ్డపై మోదీ సంచలన ఆరోపణలు:
- అస్సాం ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: (నేటి దర్శిని)
కాంగ్రెస్ పార్టీ కి పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. సోమవారం అస్సాంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న మోదీ.. దేశ భద్రతపై ప్రతిపక్షం వ్యవహరిస్తున్న తీరుకు ఇప్పటికే పలుమార్లు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని విమర్శించారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో కూడా కాంగ్రెస్ పార్టీ పాకిస్థాన్ పాటే పాడిందని

-మిగతా 2 లో



## కోహెడ భూములపై కన్నేశారా?

- రూ.3 వేల కోట్ల స్థల విక్రయానికి యత్నం
- ప్రభుత్వం వెనక్కి తగ్గాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు

తుర్కయంజాల్
కోహెడ ఫ్రూట్ మార్కెట్‌కు కేటాయించిన సుమారు రూ.3 వేల కోట్ల విలువైన సుమారు 200 ఎకరాల భూములను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ కోహెడ మార్కెట్ స్థలాన్ని పరిశీలించిన అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో అంత ర్జాతీయ స్థాయి పండ్ల మార్కెట్ నిర్మాణానికి రూ.1000 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేసినప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం టెండర్లు పిలవకుండా భూముల విక్రయానికి ప్రయత్నించడం అన్యాయమని అన్నారు. కొద్దిమంది దళారుల ప్రయోజనాల కోసం లక్షలాది మంది రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓఆర్ఆర్ సమీపంలోని విలువైన భూములను విక్రయించి, ఇతర ప్రాంతాలకు మార్కెట్‌ను మార్చే కుట్ర జరుగుతోందని ఆరోపించారు.

-మిగతా 2 లో

# వర్షం కారణంగా కేకేఆర్, పీబీకేఎస్ మ్యాచ్ రద్దు

మొదటి తరువాయి



అప్పటికి జట్టు స్కోరు 25/2గా ఉంది. ఫిన్ అలెన్ (6), కామెరూన్ గ్రీన్ (4) పెవిలియన్ చేరారు. క్రీజులో కెప్టెన్ అజింక్య రహానే (8), ఎ.రఘువంశీ (7) ఉన్నారు.తొలుత చిన్నగా ప్రారంభమైన వాన ఎంతకీ తగ్గలేదు. ఇదే సమయంలో బలమైన గాలులు సైతం వీయడంతో ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్‌కే పరిమితం అయ్యారు. చాలా సేపటి తర్వాత వర్షం తగ్గింది. కానీ ఔట్ ఫీల్డ్ చిత్తడిగా మారడంతో మ్యాచ్ నిర్వహణ సాధ్యం కాలేదు. కనీసం ఐదు ఓవర్ల ఆట అయినా ఆడించేందుకు అంపైర్లు ప్రయత్నించారు. కానీ అది కూడా సాధ్యం కాలేదు. దీంతో చివరకు చేసేదేంలేక అంపైర్లు మ్యాచును రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇరు జట్ల కెప్టెన్‌లతో మాట్లాడిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు.ఈ ఫలితంతో ఇరు జట్ల ఖాతాలో చెరో పాయింట్ చేరింది. ఐపీఎల్ 2026లో వర్షం కారణంగా రద్దు అయిన తొలి మ్యాచ్ ఇదే కావడం గమనార్హం. ఈ ఫలితంతో పంజాబ్ కింగ్స్.. పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానానికి చేరింది. ఆ జట్టు ఖాతాలో ఐదు పాయింట్లు ఉన్నాయి. మరోవైపు కోల్‌కతా నైట్ రైడర్స్ తమకు దక్కిన తొలి పాయింట్‌తో పాయింట్ల ఖాతాను తెరిచింది. ప్రస్తుతం ఆ జట్టు పాయింట్స్ టేబుల్‌లో 8వ ప్లేసులో ఉంది.

## ఢిల్లీ అసెంబ్లీలో భద్రతా వైఫల్యం

మొదటి తరువాయి

ఇటీవల ముగిసిన బడ్జెట్ సమావేశాల వేళ ఢిల్లీ అసెంబ్లీకి బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ క్రమంలో తాజా ఘటన చోటుచేసుకోవడం భద్రతా వైఫల్యాన్ని సూచిస్తోంది. భద్రతా లోపంగా పరిగణించి దర్యాప్తు చేస్తున్నామని ఢిల్లీ అసెంబ్లీ వర్గాలు పేర్కొన్నాయి.

## 9 మంది పోలీసులకు ఉరిశిక్ష..

మొదటి తరువాయి

దీంతో కేసు విచారించిన జడ్జి జీ ముత్తుకుమారన్ అప్పటి స్టేషన్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఎస్‌ఐలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, నలుగురు కానిస్టేబుళ్లను నిందితులుగా పేర్కొంటూ వారికి మరణశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు

## పాములు, మొసళ్లతో సరిహద్దు కాపలా!..

మొదటి తరువాయి

ఉన్నాయి.ఇక్కడ భౌతికపరమైన అడ్డంకులు ఏర్పాటు చేయడం వల్ల స్మగ్లింగ్, ఇతర అక్రమ కార్యకలాపాలు, చొరబాట్లను నిరోధించడం చాలా కష్టతరం. కాగా, కొత్త ప్రణాళికకు అనుకూలంగా ఉన్న నదీతీర ప్రాంతాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని బీఎస్ఎఫ్‌ను ఉన్నతాధికారులు ఆదేశించారు. అయితే ఈ ప్రణాళిక ప్రస్తుతం చర్చల దశలోనే ఉందని, భవిష్యత్‌లో దీనిని అమలు చేస్తారో లేదో తెలియదని ఒక ఉన్నతాధికారి తెలిపారు. కాగా, అదే సమయంలో డ్రోన్లు, సెన్సార్లు, కెమెరాలు, ఇతర రక్షణ వ్యవస్థలతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సరిహద్దుల్లో బీఎస్ఎఫ్ నిఘాను పటిష్టం చేసినట్టు ఆయన చెప్పారు.

## చందమామ చెంతకు ఆర్టెమిస్-2..

- నేడు తిరుగు ప్రయాణం..
- 10న ల్యాండింగ్



**న్యూఢిల్లీ**

దాదాపు 53 ఏండ్ల తరువాత మానవులు మరోసారి జాబిల్లి చెంతకు చేరారు. గత అర్ధశతాబ్ద కాలంలో అంతరిక్షంలోకి అడుగుపెట్టిన ప్రతి మానవుడూ విశ్వపు ఉపరితలాన్ని స్పృశించి వచ్చాడు తప్ప, అది దాటి అవతలికి వెళ్లలేదు. కానీ అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా చేపట్టిన ఆర్టెమిస్-2 యాత్రలో నలుగురు వ్యోమగాములు చంద్రుడి సమీపానికి చేరారు. వారిని తీసుకెళ్లిన ఓరియన్ వ్యోమనౌక ఈ నెల 6న 4,06,773 కిలోమీటర్లు ప్రయాణించి అత్యంత సుదూర మానవ అంతరిక్ష యాత్రగా రికార్డు సృష్టించింది.ఇంతకుముందు 1970లో అపోలో 13 నెలకొల్పిన రికార్డు కంటే ఇది 2,500 కిలోమీటర్లు అదనం. వ్యోమనౌక భారత కాలమానం ప్రకారం ఈ నెల 7న అర్ధరాత్రి 12:15కు చంద్రుడి సమీపం నుంచి తిరుగు ప్రయాణం కానున్నది. ప్రస్తుతం అంతరిక్షంలో ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) భూకక్ష్యలో 400 కిలోమీటర్ల దూరంలో ఉండగా, చంద్రుడు భూమికి 3,84,633 కిలోమీటర్ల దూరంలో ఉన్నాడు. ఇంతకుముందు అపోలో-13 4,00,171 కిలోమీటర్ల దూరం ప్రయాణించగా, ఆర్టెమిస్-2 మరో 2,500 కిలోమీటర్ల దూరం ఎక్కువగా ప్రయాణించనుంది. చంద్రుడి చుట్టూ ప్రయాణం పూర్తిచేశాక వ్యోమనౌక ఈ నెల 10న పసిఫిక్ మహాసముద్రంలో ల్యాండింగ్ కావచ్చు.

# హామీలు నెరవేరుస్తున్నాం

మొదటి తరువాయి

పిప్రి గ్రామంలో 'ప్రజాపాలన-ప్రగతిబాట' బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు.పోరాటయోధుడు కుమురంభీం స్ఫూర్తితో ప్రజాపాలన తీసుకురావడానికి పోరాటాల పురిటిగడ్డ ఇంద్రవెల్లి నుంచి టీపీసీసీ నాయకుడిగా యాత్ర ప్రారంభిస్తే సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క పిప్రి గ్రామం నుంచి పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేపట్టారని గుర్తు చేశారు. ఆనాడు ప్రజలకు ఇచ్చిన హామీలను నేడు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజల గుండెల నిండా అభిమానం ఉందని, మహబూబ్‌నగర్‌ను ఏ విధంగానైతే అభివృద్ధి చేస్తానో ఆదిలాబాద్‌ను కూడా అదే విధంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. రాబోయే గోదావరి పుష్కరాలకు నిధులు కేటాయించడంతోపాటు బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధిలో భాగంగా మొట్టమొదటిగా గూడెం సత్య నారాయణ స్వామి ఆలయానికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా త్వరలోనే గిరిజన యునివర్సిటీ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. జిల్లాలు పారిశ్రామికపరంగా, పర్యాటక కేంద్రంగా అభివృద్ధిపర్చడమే కాకుండా 2034 నాటికి విద్యాకేంద్రంగా ఆదిలాబాద్‌ను తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి వస్తానని, వచ్చిన ప్రతిసారీ నిధులు కేటాయిస్తానని చెప్పారు.



రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించిన సీఎం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని, ఇందుకు రూ.10వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.22,500 కోట్లతో 4.5లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని చెప్పారు. ఇప్పటివరకు రూ.5,400 కోట్లు లబ్దిదారుల ఖాతాల్లో జమ చేసినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, ఎంపీ గొడెం నగేష్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జుపటేల్, అనిల్‌జాదవ్, రామారావ్ పటేల్, మహేశ్వర్‌రెడ్డి, ప్రేంసాగర్‌రావ్, కలెక్టర్లు రాజర్షి షా, అభిలాష అభినవ్, హరిత, కుమార్ దీపక్, ఎస్పీలు అఖిల్ మహాజన్, జానకి షర్మిల, ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తాత్కాలిక సంధికి నో!

మొదటి తరువాయి

స్పష్టం చేస్తున్నట్లు ఇరాన్ స్పందన తెలియచేస్తున్నది. ఇరాన్ తన సమాధానంలో తక్షణ కాల్పుల విరమణతోపాటు 10 నిబంధనల ప్రణాళికను పొందుపరిచింది. ఇందులో పశ్చిమాసియా ప్రాంతమంతటా ఘర్షణలను అంతం చేయడం, హెర్మూజ్ జలసంధి గుండా సురక్షిత ప్రయాణానికి భరోసా ఇచ్చే నిబంధనలు అమలుచేయడం, ఇరాన్ పునర్నిర్మాణానికి సంబంధించిన ఆంక్షలు, నిబంధనలు ఎత్తివేయడం వంటి డిమాండ్లు ఉన్నాయి. తాము కేవలం కాల్పుల విరమణను మాత్రమే ఆమోదించబోమని కైరోలోని ఇరాన్ దౌత్య కార్యాలయ అధిపతి మొజ్తబా ఫిర్దౌసీ పోర్ సోమవారం అసోసియేటెడ్ ప్రెస్‌కు తెలిపారు. ఇరాన్‌పై మళ్లీ దాడి జరగదన్న హామీలతో కూడిన యుద్ధ ముగింపును తాము ఆమోదిస్తామని ఆయన స్పష్టం చేశారు. గడువులోగా ఒప్పందానికి అంగీకరించకపోతే ఇంధన, మౌలిక సదుపాయాలను బాంబులతో పేల్చివేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో ఇరాన్ నుంచి ఈ స్పందన వెలువడింది. కాగా, పాకిస్థాన్ బలపరుస్తున్న కాల్పుల విరమణ ప్రతిపాదన తమ పరిశీలనలో ఉన్న అనేక ఆలోచనలలో ఒకటని వైట్ హౌస్ అధికారి ఒకరు సోమవారం సీబీఎస్ న్యూస్‌కు తెలిపారు. అయితే అధ్యక్షుడు ట్రంప్ దీనికి ఆమోదం తెలపలేదని, ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ కొనసాగుతుందని ఆయన చెప్పారు. ఇరాన్, అమెరికా మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో



సమాచార మార్పిడి మార్గాలను తెరచి ఉంచడానికి పాకిస్థాన్ తెరవెనుక నుండి మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నది. పాకిస్థాన్‌తోపాటు ఈజిప్ట, తుర్కియే కూడా ట్రంప్ దూత స్టీవ్ విట్కాఫ్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మధ్య ప్రత్యక్ష సందేశాల మార్పిడికి దోహదపడుతున్నాయి.

**భారీ మూల్యం తప్పదు: ట్రంప్**

తన కాల్పుల విరమణ ప్రతిపాదనను ఇరాన్ తిరస్కరించడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం వెంటనే స్పందించారు. ఇరాన్ స్పందనతో తాను చాలా కలత చెందానని ఆయన తెలిపారు. ఒప్పందాన్ని కుదుర్చుకోవడంలో విఫలమైన పక్షంలో ఇరాన్ భారీ మూల్యాన్ని చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరిస్తూ తాను విధించిన గడువు సమీపిస్తున్న వేళ తను తీసుకునే వైఖరి ఎంత కఠినంగా ఉండగలదో ఆయన సూచనప్రాయంగా వెల్లడించారు. వాషింగ్టన్ డీసీలోని వైట్ హౌస్ వెలుపల విలేకరులతో మాట్లాడుతూ ఇరాన్‌కు విధించిన మంగళవారం గడువులో ఎటువంటి మార్పు ఉండబోదని, అదే ఫైనల్ అని ట్రంప్ స్పష్టం చేశారు. వారు చేయాల్సింది చేస్తే ఇది(యుద్ధం) చాలా త్వరగా ముగిసిపోవచ్చు అని ఇరాన్‌ని ఉద్దేశించి ట్రంప్ చెప్పారు. వారు కొన్ని పనులు చేయాల్సిందే. ఆ విషయం వారికి తెలుసు. మొదటి, రెండవ దశలలో ఉన్న ఉన్మాదులతో పోలిస్తే అక్కడి ప్రజలు చాలా తెలివైనవారు అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

## కాంగ్రెస్ పార్టీకి పాకిస్థాన్‌తో దోస్తీ

మొదటి తరువాయి

ఆరోపించారు.కాంగ్రెస్, పాకిస్థాన్ సంబంధం ఇప్పటిది కాదని, ఎప్పటి నుంచో సాగుతున్నదని, ఇది జాతీయ భద్రతకు చాలా ప్రమాదకరమని ప్రధాని వ్యాఖ్యానించారు. ఆదివారం ఢిల్లీలో పవన్ ఖేరా, గువాహటిలో గౌరవ్ గొగోయ్ రెండు వేర్వేరు ప్రెస్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించారని, ఆ కాన్ఫరెన్స్‌కి సంబంధించిన మొత్తం సమాచారాన్ని పాకిస్థాన్ సామాజిక మాధ్యమాల నుంచి తీసుకున్నట్టు తాము గుర్తించామని విమర్శించారు. అస్సాం ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, రాష్ట్రంలో ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో పాకిస్థాన్ ఛానల్ 11 టాక్ షోలను నిర్వహించిందని, ఇలా ఇంతకు ముందెప్పుడూ జరగలేదని, ప్రతి షోలోనూ చివరకు కాంగ్రెస్ గెలవాలని చెప్పారని ప్రధాని తెలిపారు. ఆదివారం జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లలో పాకిస్థాన్ జోక్యం స్పష్టంగా వెల్లడైందని అన్నారు. ఇదిలావుంటే అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ సతీమణి రిణికి భూయాన్ శర్మకు మూడు దేశాల పాస్‌పోర్టులు ఉన్నాయని, దాంతోపాటు ఆమె ఆస్తులను ఆయన అఫిడవిట్‌లో వెల్లడించకుండా దాచిపెట్టారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. సాక్ష్యం లేకుండా తప్పుడు ఆరోపణలు చేసినప్పుడు కేసు నమోదు చేయొచ్చని, ఎన్నికల సమయంలో ప్రజలను ప్రభావితం చేసేందుకే ఇలాంటి విమర్శలు చేశారని హిమాంత కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు.ఐ

## కోహెడ భూములపై కన్నేశారా?

మొదటి తరువాయి

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కనబెట్టి భూముల వ్యవహారాలపైనే దృష్టి సారించిందని విమర్శించారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. కోహెడ భూముల విక్రయాన్ని ఏ పరిస్థితుల్లోనూ సహించబోమని, మార్కెట్ అభివృద్ధి వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బీఆర్ఎస్ నాయకులు క్యామ మల్లేశ్, వంగేటి లక్ష్మారెడ్డి, మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి, సత్తు వెంకట రమణారెడ్డి, కందాడ లక్ష్మారెడ్డి, సామ సంజీవరెడ్డి, దండెం రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్‌సేఫ్టీ కోసం ప్రత్యేక వ్యవస్థ

మొదటి తరువాయి




హైదరాబాద్ జలవిహార్ నుంచి మొదలైన ఫుడ్ సేఫ్టీ అవేర్‌నెస్ వాకథాన్‌ను సోమవారం మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాకథాన్ జలవిహార్ నుంచి ఐమ్యాక్స్ పక్కనున్న హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వరకూ కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొన్నేండ్లుగా మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు, బిజీ లైఫ్ స్టైల్, పెరుగుతున్న అర్బనైజేషన్ వల్ల ఇంట్లో వంట చేసుకోవడం తగ్గిపోవడంతో హోటళ్లు, రెస్టారెంట్లలో తినడం, ప్రాసెస్డ్ ఫుడ్ వినియోగం విపరీతంగా పెరిగిందన్నారు. ఈ డిమాండ్‌కు అనుగుణంగా రాష్ట్రంలో ఫుడ్ ఇండస్ట్రీ కూడా వేగంగా విస్తరించిందని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా చిన్నవి, పెద్దవి అన్నీ కలిపి సుమారు 1.41 లక్షల ఫుడ్ బిజినెస్ సంస్థలు ఉన్నాయని తెలిపారు. వీటిలో దాదాపు 80 శాతం పట్టణ ప్రాంతాల్లోనే కేంద్రీకృతమై ఉండటం, నగరాల్లో రెడీ టు ఈట్, ప్రాసెస్డ్ ఆహార పదార్థాలకు ఉన్న అధిక డిమాండ్‌ను స్పష్టంగా తెలియజేస్తోందన్నారు. ఈ పరిస్థితిని కొంతమంది దుర్వినియోగం చేస్తూ ఆహారాల్లో కల్తీకి పాల్పడుతున్నారన్నారు. ఉప్పు, పప్పులు, చింతపండు, చక్కెర, టీ పొడి ఇలా దేన్నీ వదలడం లేదని తెలిపారు. మరోవైపు నాసిరకం నూనెలు, నాణ్యత లేని పదార్థాలతో ఆహారం తయారు చేస్తున్నారని, కల్తీ, నాసిరకం ఆహారం వినియోగం తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారి తీస్తోందని చెప్పారు. దీర్ఘకాలంలో మధుమేహం, రక్తపోటు, గుండె, మూత్రపిండాల వ్యాధులు, అధిక బరువు వంటి సమస్యలకు కూడా కల్తీ, నాసిరకం ఆహారం కారణమవుతోందని డాక్టర్లు చెబుతున్నారని తెలిపారు. హైదరాబాద్‌తోపాటు తెలంగాణ అంతటా నాన్-కమ్యూనికబుల్ వ్యాధుల భారం పెరుగుతుండటానికి అనారోగ్యకర ఆహార అలవాట్లు ఒక ప్రధాన కారణంగా నిలుస్తున్నాయని తెలిపారు. ఫుడ్ సేఫ్టీ విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

# బిజెపి 47వ స్థాపన దివాస్ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరణ





● ముఖ్య అతిథిగా జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి

**ఆమనగల్లు, ఏప్రిల్06(నేటి దర్శిని ప్రతినిధి):** భారతీయ జనతా పార్టీ 47వ స్థాపన దివాస్ సందర్భంగా ఆమనగల్ మున్సిపాలిటీ పట్టణంలో అటల్ బిహారీ వాజ్పేయి చౌరస్తాలో ఘనంగా పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. బిజెపి మున్సిపాలిటీ అధ్యక్షులు కర్నాటి విక్రం రెడ్డి జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి ఈ సందర్భంగా పార్టీ స్థాపకులకు, మహానేతలకు ఘన నివాళులు అర్పించారు. ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిస్తూ, దేశసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బిజెపి మరింత బలపడాలని ఆచారి ఆకాంక్షించారు. భారతీయ జనతా పార్టీ 1980 ఏప్రిల్ 6న స్థాపించబడినప్పటి నుండి సాధారణ కార్యకర్తల శక్తితో ఎదుగుతూ దేశ రాజకీయాల్లో కీలక శక్తిగా అవతరించింది. ప్రారంభ దశలో కేవలం 2 ఎంపీ స్థానాలతో ప్రారంభమైన ఈ పార్టీ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటూ క్రమంగా తన బలాన్ని పెంచుకుంది. అటల్ బిహారీ వాజ్పేయి గారి నాయకత్వంలో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి తన సత్తాను చాటుకున్న బిజెపి, అనంతరం నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా అఖండ విజయాలను సాధిస్తూ పూర్తి మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి దేశ అభివృద్ధికి కొత్త దశ,దిశను చూపుతోంది. "సబ్కాసాత్‌బిసబ్కా వికాస్‌బిసబ్కా విశ్వాస్"అనే సిద్ధాంతంతో అన్ని వర్గాల అభ్యున్నతిని లక్ష్యంగా ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కండే హరి ప్రసాద్ ,కౌన్సిలర్ సునీత ప్రశాంత్, మాజీ కౌన్సిలర్లు గోరటి నరసింహ,శ్రీకాంత్ సింగ్, చెక్కల లక్ష్మణ్, సుందూరు శేఖర్, చెన్నకేశవులు,తల్లోజు విజయ్ కృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు రవి రాథోడ్,అల్లాజీ గౌడ్, గంగ రవి గౌడ్, నాగిళ్ల సందీప్,పంచ మల్లయ్య, గోజే ఆనంద్ , వడ్డే పెద్దయ్య, తల్లోజు ప్రభాకర్ ,పాలాది శ్రీను, కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలకపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ కాషాయ జెండా ఎగరవేశారు..
(నేటి దర్శిని ప్రతినిధి మిడ్జిల్)

## చలో వరంగల్ మహా ధర్నాకు పిలుపు

### ఆర్టిజన్ కార్మికుల డిమాండ్ తీర్చాలని డిమాండ్



**మిడ్జిల్, ఏప్రిల్06 (నేటి దర్శిని ప్రతినిధి):** వరంగల్ లోని టిజిఎన్పిడిసిఎల్ విద్యుత్ భవన్ ముందు ఏప్రిల్ 7 ఉదయం 10 గంటలకు మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు ఐ ఎన్ టి యు సి 327 యూనియన్ జడ్చర్ల డివిజన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మద్ది నర్సింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని సుమారు 23 వేల ఆర్టిజన్ కార్మికులకు ఏపీఎస్ఈబి రూల్స్ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. విద్యా అర్హతల ప్రకారం కన్వర్షన్ చేయడంతో పాటు అన్ మ్యాన్ కార్మికులను ఆర్టిజన్ గా గుర్తించాలని కోరారు. పీస్ రేట్ కార్మికులకు జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని పేర్కొన్నారు. డిమాండ్లు నెరవేర్చకపోతే ఏప్రిల్ 8 నుంచి విధులు బహిష్కరించి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు.

# మహబూబ్‌నగర్ జిల్లా MT పూల్‌లో "టూ పోస్ట్ హైడ్రాలిక్ లిఫ్ట్" ప్రారంభించిన

● DIG ఎల్.ఎస్.చౌహాన్, ఐపిఎస్ గ

**మిడ్జిల్, ఏప్రిల్ 6, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్‌నగర్ జిల్లా మీ పూల్ నందు ఆధునిక వాహన మరమ్మత్తుల కోసం ఉపయోగించే "టూ పోస్ట్ హైడ్రాలిక్ లిఫ్ట్" (ఃషశీ ూశీర ుఎఎఉఎతీుబశ్రీఱఉ ూఱటట) ను జోన్–VII జోగులాంబ DIG శ్రీ ఎల్.ఎస్.చౌహాన్, ఐపిఎస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపిఎస్ గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది.ఈ సందర్భంగా DIG మాట్లాడుతూ, పోలీస్ విభాగంలో వాహనాల నిర్వహణ అత్యంత కీలకమని, ముఖ్యంగా ఎమర్జెన్సీ పరిస్థితుల్లో వాహనాలు సిద్ధంగా ఉండటం చాలా అవసరమని



తెలిపారు. ఈ టూ పోస్ట్ హైడ్రాలిక్ లిఫ్ట్ వలన వాహనాలను సులభంగా పైకి ఎత్తి, తక్కువ సమయంలో మరమ్మత్తులు చేయుటకు వీలు కలుగుతుందని, దీనివల్ల సమయం మరియు శ్రమ రెండూ ఆదా అవుతాయని పేర్కొన్నారు.అలాగే, ఈ యంత్రం ద్వారా వాహనాల దిగువ భాగాన్ని సులభంగా పరిశీలించి, చిన్నపాటి సమస్యలనుంచి పెద్దపాటి మరమ్మత్తుల వరకు వేగంగా గుర్తించి పరిష్కరించవచ్చని తెలిపారు. దీని వలన పోలీస్ వాహనాల పనితీరు మెరుగుపడి, ఫీల్డ్ డ్యూటీలలో మరింత సమర్థవంతంగా సేవలు అందించగలమని అన్నారు.జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపిఎస్ మాట్లాడుతూ, ఈ ఆధునిక సదుపాయం ద్వారా మీ విభాగం పనితీరు మరింత మెరుగుపడుతుందని, వాహనాల మెయింటెనెన్స్ వేగవంతం అవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డి.ఎస్.పి రమణారెడ్డి, వర్టికల్ డి.ఎస్.పి బాలాజీ, మీూ నగేశ్, ఆర్ఐ (అడ్మిన్) కృష్ణయ్య మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలంటూ ఎమ్మార్వో కు కౌన్సిలర్ అనూష పుల్లారెడ్డి వినతి పత్రం



**ఆమనగల్లు, ఏప్రిల్06 (నేటి దర్శిని ప్రతినిధి):** ఆమనగల్లు పట్టణ పరిధిలోని గుర్రం గుట్ట వెనకాల ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నెంబర్699/అ లో మద్దూరి భాను సన్నాఫ్ బాలయ్య గత కొంతకాలంగా ప్రభుత్వ భూమిని చదును చేసుకుంటున్నాడు. అట్టి గవర్నమెంట్ భూమిని తన అవసరాల కోసం గుంటలు, గుంటలుగా చేసి భూమిని అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నాడు. ప్రభుత్వ భూములు లేక ప్రభుత్వ కార్యాలయాలు ఆమనగల్లులో ప్రభుత్వ స్థలాలు లేవని వేరే ప్రాంతానికి తరలిపోతున్నాయని ఆమనగల్ మండలం అభివృద్ధి చెందడంలో వెనుకబడి పోతుందని, ఇట్టి ప్రభుత్వ భూమిని మార్క్ చేసి ఆమనగల్ మున్సిపాలిటీ ప్రజలకు, భావితరాలకు ఈ భూమి ఉండే విధంగా కాపాడి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆమనగల్ మండల ఎమ్మార్వో కి, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ కి వినతి పత్రాన్ని పట్టణ ప్రజలతో కలిసి కౌన్సిలర్ అనూష పుల్లారెడ్డి అందజేశారు.

# ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ





● ముఖ్య అతిథిగా పాల్గొన్నబిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి

**మిడ్జిల్,ఏప్రిల్ 06 ( నేటి దర్శిని ప్రతినిది)** బీజేపీ 47వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఉర్కొండ మండల కేంద్రంలో బిజెపి పార్టీ అధ్యక్షుడు రాజేందర్ ఆధ్వర్యంలో బీజేపీ జెండాను ఎగురవేసి స్థానిక నాయకులు,కార్యకర్తలు ప్రజలతో కలిసి మిఠాయిలు పంచుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రెండు సీట్లతో ప్రారంభమైన బీజేపీ నేడు దేశంలోనే బలమైన పార్టీగా ఎదిగిందన్నారు. దేశంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏ రాజకీయ పార్టీ తీసుకోని విధంగా నిర్ణయాలు తీసుకుని చరిత్రనే తిరగరాసిందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ కూటమికి 400 పైచిలుకు స్థానాలు కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ సీనియర్ నాయకులు, మండల నాయకులు కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## మీసాల వర్షిత్ ముఖ్య నేతల సమక్షంలో బిఆర్ఎస్ లో చేరిక...



**ఆమనగల్లు, ఏప్రిల్06 (నేటి దర్శిని ప్రతినిధి):** ఆమనగల్లు పట్టణానికి చెందిన మీసాల వర్షిత్ టిఎస్ఎస్ఓ రాష్ట్ర సోషల్ మీడియా ఇన్చార్జ్ విద్యార్థి సంఘానికి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తెలంగాణ ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి, ఆధ్వర్యంలో మాజీ మంత్రి హరీష్ రావు మాజీ ఎస్సీ కమిషన్ మెంబర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ సమక్షంలో తెలంగాణ భవన్ లో కల్వకుర్తి నియోజకవర్గం కి సంబంధించిన 300 మంది పలు పార్టీ విద్యార్థి నాయకులతో కలిసి సోమవారం బిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ కల్వకుర్తి ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే గురక జయపాల్ యాదవ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్,ఉప్పల వెంకటేష్, మాజీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్,ఎల్ ఎన్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు శ్రావణ్, అభినయ్,శివ,భవాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూ బంధువులు ఐక్యతతో ఉండాలి

**నాగోల్, ఏప్రిల్06 (నేటి దర్శిని):** హిందూ బంధువులు అందరూ ఐక్యతతో ఉండాలని విశ్వ హిందు పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ రావి నూతల శశిధర్ అన్నారు. ఈ సందర్భంగా నాగోల్ జై పూరి కాలనీ విశ్వ హిందు పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఎగ్గే మల్లేశం ఫంక్షన్ హాల్లో హిందూ సమ్మేళన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం శ్రీనివాస్, ఎల్లం పంతుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్రహ్మశ్రీ పాశర్లపాటి శ్రీనివాస్ బంగారయ్య, విశ్వహిందు పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్, మహిళా వక్త నవత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...





భారతదేశం సనాతన ధర్మం కల దేశమని హిందువులందరూ బంధువులుగా మెలగాలని అన్నారు. ప్రతి ఒక్కరూ దేవుళ్ళను పూజిస్తూ మన హిందూ సనాతన ధర్మాన్ని కాపాడాలని సూచించారు. మన పూర్వీకుల అస్తిత్వాన్ని కాపాడుతూ హిందువులందరం కలిసిమెలిసి ఉండాలని అన్నారు. హిందువులందరూ కులాల అతీతంగా కలిసి ఉండాలని గడప లోపల మన కులంగా గడప దాటితే హిందువులం అని ఈ లోకానికి చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ బిజెపి ఇన్చార్జ్ సామరంగారెడ్డి, పద్మా రెడ్డి నాగోల్ డివిజన్ బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఆద్యాంతం హిందువుల పేర్లపై కొనసాగింది.

# దొంగతనం కేసులో పాత నేరస్తుడి అరెస్ట్









**నాగోల్, ఏప్రిల్06 (నేటి దర్శిని):** నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంట్లో చొరబడి నగలు, విలువైన వస్తువులు దొంగిలించిన ఓ పాత నేరస్తుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ వెల్లడించిన వివరాల ప్రకారం...ఈ నెల 4వ తేదీ అర్ధరాత్రి సాయి నగర్ లలిత నగర్ కు చెందిన కొమ్మెర నవీన్ (20) అని యువకుడు నాగోల్‌లోని ఎకోపాలిట్ అపార్ట్‌మెంట్ నాల్గవ బ్లాక్, ఐదవ అంతస్తులో నివసిస్తున్న రమాకాంత్ కౌశిక్ ఇంట్లోకి కిటికీ గ్రిల్ తొలగించి చొరబడ్డాడు. కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో మరో బెడ్‌రూమ్‌లోని కబోర్డ్‌లో ఉన్న రమాకాంత్ కౌశిక్ తల్లికి చెందిన సుమారు పదిన్నర తులాల బంగారు నగలు ఒక నెక్లెస్, రెండు లాంగ్ చైన్లు, ఒక బ్లాక్ బీడ్స్ చైన్, గాజులు, ఉంగరాల తో పాటు హెచ్ ల్యాప్‌టాప్‌ను దొంగిలించాడు. అలాగే ఒక యాక్టీవా బైక్‌ను కూడా అపహరించినట్లు తెలిపారు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను వివిధ కోణాల్లో పరిశీలించి నిందితుడిని గుర్తించారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు.దొంగిలించిన నగలు, ల్యాప్‌టాప్, యాక్టీవా బైక్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై నాగోల్, హయత్‌నగర్, సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్లలో గతంలో కూడా కేసులు ఉన్నాయని, ఇటీవలే జైలు నుంచి విడుదలై మళ్లీ దొంగతనానికి పాల్పడినట్లు సీఐ తెలిపారు.కేసును చాకచక్యంగా ఛేదించిన డీఐ రుద్వీర్, డీఎస్ఐ నరసింహ, కానిస్టేబుళ్లు సుభాష్, సాయిష్, క్రైమ్ రైటర్ మౌనికలను సీఐ అభినందించారు.

# పేద కుటుంబానికి భరోసా కిడ్నీ పేషెంట్ కు 5 లక్షల ఎల్ఓసి మంజూరు : ఎమ్మెల్యే

- ప్రజల సమస్యలకు వెంటనే స్పందన
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహాయంతో సంతోషకు ఆర్థిక భరోసా
- పేద కుటుంబానికి ఆశాకిరణం రూ.5 లక్షల ఎల్ఓసి మంజూరు చేయించిన దేవేందర్ ముదిరాజ్



**కొత్తూరు 6 ఏప్రిల్ నేటి దర్శిని ప్రతినిధి** కిడ్నీ సమస్యతో బాధపడుతున్న మహిళకు ఎమ్మెల్యే చొరవ ఎల్ఓసి ద్వారా ?5 లక్షల సహాయం అందజేయించిన స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవేందర్ ముదిరాజ్ అన్నారు.కొత్తూరు మున్సిపాలిటీకి చెందిన సంతోష అనే మహిళ కిడ్నీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది.ఆర్థిక పరిస్థితులు బలహీనంగా ఉండటంతో చికిత్స కోసం ఇబ్బంది పడుతున్న కుటుంబం, స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వీరమోని దేవేందర్ ముదిరాజ్‌ను సంప్రదించారు.ఈ విషయాన్ని వెంటనే స్పందించిన దేవేందర్,ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో, ప్రభుత్వ పథకం కింద ఎల్ఓసి ద్వారా సంతోష కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం సోమవారం మంజూరు చేయించారు.ఈ సందర్భంగా సంతోష కుటుంబ సభ్యులు తమకు అండగా నిలిచిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,దేవేందర్ ముదిరాజ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి తక్షణ సహాయం అందేలా చూడటం మన బాధ్యత. అవసరమైన ప్రతి ఒక్కరికీ సహాయం అందేలా ప్రయత్నిస్తాం అని ఆయన తెలిపారు.

# జాతీయ వాద సిద్ధాంతాలతో ముందుకు సాగుతున్న బీజేపీ



**మిడ్జిల్, ఏప్రిల్06 (నేటి దర్శిని):** భారతదేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అతిపెద్ద జాతీయ పార్టీగా గుర్తింపు పొందిన భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యక్తిగత ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలకే అత్యున్నత ప్రాధాన్యతనిచ్చే పార్టీగా బీజేపీ నిలుస్తోందన్నారు. "నేషన్ ఫస్ట్, పార్టీ నెక్స్ట్, క్యాండిడేట్ లాస్ట్" అనే జాతీయవాద సిద్ధాంతంతో బీజేపీ దేశవ్యాప్తంగా ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుందని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, సుస్థిర పాలన, సామాజిక న్యాయం లక్ష్యాల సాధనలో బీజేపీ కీలక పాత్ర పోషిస్తోందని ఆయన తెలిపారు. ప్రతి కార్యకర్త దేశసేవను ధ్యేయంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా పార్టీ శ్రేయోభిలాషులు, కార్యకర్తలు, నాయకులు మరియు జాతీయవాదులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. బీజేపీ మరింత బలోపేతం కావాలని, దేశానికి సేవ చేయడంలో ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు.

# మహనీయుల జయంతి ఉత్సవ కమిటీలలో అన్ని కులాలకు అవకాశం కల్పించాలి

- బిసి బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రతాపగిరి విజయకుమార్. రాష్ట్ర నాయకులు నందికంటి సాయికుమార్



**(నేటి దర్శిని):హైదరాబాద్ )** మహనీయుల జయంతి ఉత్సవ కమిటీలలో అన్ని కులాలకు అవకాశం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర బిసి కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ కి హైదరాబాద్ మసాబ్ ట్యాంక్ లోని వారి కార్యాలయం లో వినతి పత్రం ఇచ్చి కోరిన తెలంగాణ బిసి బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రతాపగిరి విజయకుమార్. రాష్ట్ర నాయకులు నందికంటి సాయికుమార్ తదితరులు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 112 బిసి కులాలకు పైగా ఉన్న కులాలు వారి కుల సమస్యల పరిష్కారం కోరకు ఆయా ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్తూ బిసిలకు రాజ్యాధికారమే అంతిమ లక్షంగా పని చేస్తూ కులాలు అన్ని రంగాలలో అభివృద్ధి కోరకు తమ వంతు కృషి చేస్తూ పలు రాజకీయ పార్టీ పదవులలోనే కాకుండా వార్డు నంబర్ నుండి ఎం. పి. టి. సి, ఎం. పి. పి.,జడ్. పి. టి. సి. ఎం. ఎల్. ఎ. ఎం. పి. నామినేటెడ్ పదవులలో సీట్లు కేటాయించాలని కోరుచు అనేక రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశాయని అలాగే ఆయా బిసి కులాలలో ఉండి సమాజంలోని పలు అన్ని సంఘాల కోరకు పోరాటం చేసి వీర మరణం పొందిన వారి జయంతి, వర్ధంతి కార్యక్రమలు బిసి సంఘాలు బిసి కుల సంఘాల కోరిక మేరకు రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించడం జరుగుతుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం వేసే ఉత్సవ కమిటీలలో అన్ని బిసి కులాలకు అనగా కమిటీ చైర్మన్ ఒక బిసి కులానికి ఇచ్చి మిగతా బిసి కులాలకు కన్వీనర్ లుగా నియమించాలని కోరారు.

# నేటి యువత బిటి రణదేవే ఉద్యమ స్ఫూర్తితో ముందుకు నడవాలి

- సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షుడు బిటీ రణదీవే వర్ధంతి



**నాంపల్లి,ఏప్రిల్06 (నేటి దర్శిని):** సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు కామ్రేడ్ బిటి రణదేవే 36వ వర్ధంతి సందర్భంగా నాంపల్లి మండల కేంద్రంలో సిఐటియు నాంపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తున్న ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి సిఐటియు మండల కన్వీనర్. ఈ సందర్భంగా ఏదుళ్ళ సునీత మాట్లాడుతూ బీటీ రణదీవే సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉండి భారత కార్మికు ఉద్యమంలో కీలకపాత్ర పోషించి ఉద్యమాన్ని కార్మిక వర్గాన్ని ఒక తాటిపై నడిచి హక్కులను సాధించారని కార్మిక బ్రతుకుల స్థితిగతులపై పూర్తి అధ్యయనం చేసి వారి ఇబ్బందులను లోతుగా అధ్యయనం చేసిన మహోన్నత వ్యక్తి భేటీ రణధీవని కొనియాడారు. ఆయన ఆశయ సాధనలో కార్మికు ఉద్యమం మరింత ముందుకు వెళ్తుందని ఆయన స్ఫూర్తితో నేటి కార్మిక ఉద్యమ నడుస్తుందని నేటితరం నడవాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యురాలు కోరే లలిత, మమత లక్ష్మమ్మ అనిత రజిత అంజమ్మ కౌసల్య యాదమ్మ పుష్పక నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ నగర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 6 (నేటి దర్శిని బ్యూరో):** కాంగ్రెస్ ప్రభుత్వం నగర అభివృద్ధి సంక్షేమ పథకాలు అందజేయుటకు కృషి చేస్తుందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. వరంగల్ నగరంలోని 54వ డివిజన్ పరిధిలోని అపూర్వ కాలనీలో రూ. 50 లక్షల వ్యయంతో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లో అభివృద్ధిలో ముందంజలో ఉంటుందన్నారు. ప్రతి కాలనీ అభివృద్ధి చేయాలనే సంకల్పంతో నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసిన పనులను పూర్తి చేశామన్నారు. అపూర్వ కాలనీ అభివృద్ధి భాగంలో ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# బీజేపీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు



**మిడ్జిల్, ఏప్రిల్06 (నేటి దర్శిని):** ప్రపంచంలోనే అతిపెద్ద జాతీయ పార్టీగా గుర్తింపు పొందిన భారతీయ జనతా పార్టీ (బీజేపీ) దేశ ప్రయోజనాలను పరమావధిగా పెట్టుకుని ముందుకు సాగుతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ, "నేషన్ ఫస్ట్ -- పార్టీ నెక్స్ట్ -- క్యాండిడేట్ లాస్ట్" అనే జాతీయవాద సిద్ధాంతంతో నడుస్తున్న ఏకైక రాజకీయ పార్టీ బీజేపీ అని అన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తూ, భారత దేశ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న పార్టీగా బీజేపీ నిలిచిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేయోభిలాషులు, కార్యకర్తలు, నాయకులు మరియు జాతీయవాదులకు హృదయపూర్వక ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. దేశాభివృద్ధి, సమగ్ర సంక్షేమం లక్ష్యంగా బీజేపీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

# భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు



**మిడ్జిల్, ఏప్రిల్ 6, (నేటి దర్శిని ప్రతినిధి):** భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మిడ్జిల్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ కాషాయ జండాను మండల పార్టీ అధ్యక్షుడు నరేష్ నాయక్ ఎగురవేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు పల్లె తిరుపతి పాల్గొని మాట్లాడుతూ.. "దేశమే ప్రథమం" (చీఫ్ఆశీఅ ఖీఆతీర్) అనే నినాదంతో, అంత్యోదయ లక్ష్యంగా, కోట్ల మంది కార్యకర్తల కృషితో సామాన్య ప్రజల గొంతుకగా మారిన ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ 'భారతీయ జనతా పార్టీ' అని అన్నారు. ఈ 47 ఏళ్ల ప్రయాణంలో పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలకు మరియు మాపై నమ్మకం ఉంచిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వాసుదేవ్, కిషన్ మోర్చా మండల అధ్యక్షులు శేఖర్ రెడ్డి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు ఆంజనేయులు, వస్పుల్ ఆంజనేయులు, ఆవ మధు,నాగరాజు, కావాలి నరేష్,నారాయణ్ తదితరులు పాల్గొన్నారుబి

# ఆమనగల్లులో రచ్చబండ స్థలం కాపాడాలని అధికారులకు అఖిలపక్ష నేతల వినతి



**ఆమనగల్లు,ఏప్రిల్06(నేటి దర్శిని ప్రతినిధి):** ఆమనగల్లు పట్టణానికి నడిబొడ్డున అంగడి బజార్లో ఉన్నటువంటి రచ్చబండ(రచ్చ కట్ట) స్థలం కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని సోమవారం అఖిలపక్ష నాయకులు మునిసిపల్ కమిషనర్ శంకర్ నాయక్, ఎస్సై సీతారాం రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. రచ్చ కట్ట స్థలంలో గతంలో పట్టణానికి సంబంధించిన సభలు, సమావేశాలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, బతుకమ్మ సంబరాలు నిర్వహించేవారని అఖిలపక్ష ముఖ్య నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్, మాజీ జెడ్పిటిసి కండే హరిప్రసాద్, కౌన్సిలర్లు ఎర్రవోలు మహేష్, నాగిళ్ల జగన్, మాజీ వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య, మాజీ కౌన్సిలర్లు శ్రీకాంత్ సింగ్, చెన్నకేశవులు,గోరటి నరసింహ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అప్పం శ్రీను, అవ్వారి శివలింగం,గాజుల శ్రీను, కోట పెద్ద అశోక్, చుక్క అల్లాజిగౌడ్, అన్ని పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


# ప్రజావాణి-ప్రజల వినతులకు తక్షణ స్పందన సమస్యల పరిష్కారానికి ఎస్పీ కట్టుబాటు"





**మిడ్జిల్, ఏప్రిల్ 6, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి (Grievance Day) కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ గారు ప్రజల నుండి నేరుగా దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుండి వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని దరఖాస్తుదారులు తమ సమస్యలను తెలియజేయడానికి ఎస్పీ కార్యాలయానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్పీ ప్రతి దరఖాస్తును స్వయంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించడం పోలీస్ శాఖ ముఖ్య బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు వేగంగా పరిష్కారం అందించడమే లక్ష్యమని, ఎవరైనా భయపడకుండా తమ ఫిర్యాదులను తెలియజేయాలని ఎస్పీ సూచించారు.జిల్లా పోలీస్ శాఖ ప్రజల సేవలో ఎల్లప్పుడూ ముందుంటుందని, ప్రతి ఫిర్యాదుకు న్యాయం జరిగేలా కట్టుబడి పనిచేస్తామని తెలిపారు.

# ఈట్ రైట్ వాక్ ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్




**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 6 (నేటి దర్శిని బ్యూరో):** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ,ఫుడ్ సేఫ్టీ శాఖ ఆధ్వర్యంలో వరంగల్ చౌరస్తా నుంచి హెడ్ పోస్ట్ ఆఫీస్ సర్కిల్ వరకు నిర్వహించిన ఈట్ రైట్ వాక్ ర్యాలీని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద జండా ఊపి ప్రారంభించారు. ఆహారము, ఆరోగ్య భవిష్యత్తు నినాదాలతో ప్లే కార్డులతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి వ్యక్తికి ప్రభుత్వ ఫలాలు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఏకైక జాతీయవాద దేశభక్తి కలిగిన బిజెపి

- **బిజెపి జిల్లా కార్యాలయంలో ఘనంగా ఆవిర్భావ దినోత్సవం వేడుకలు**




**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 6 ( నేటి దర్శిని బ్యూరో):** బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ దేశమే ప్రథమం అనే బలమైన సంకల్పంతో పనిచేసే కార్యకర్తలు కలిగిన భారతీయ జనతా పార్టీ 47వ వసంతంలోకి అడుగుపెడుతున్న పర్వదినం సందర్భంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని, దేశవ్యాప్తంగా కోట్లాది కార్యకర్తలు ఉత్సాహంగా జరుపుకుంటున్న పండుగ వేడుక అని బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంటా రవి కుమార్ కుమార్ అన్నారు. వరంగల్ జిల్లా ధర్మారంలోని పార్టీ కార్యాలయంలో బిజెపి నాయకులు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయవాదాన్ని నరనరాన నింపుకొని దేశంకోసం, ధర్మం కోసం పార్టీ సిద్ధాంతం కోసం, ప్రాణాలర్పించిన కార్యకర్తలను స్మరించుకుంటూ ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా అవతరించేందుకు కృషి సల్పిన బిజెపి నాయకులకు, కార్యకర్తలకు, మద్దతుదారులందరికీ పేరుపేరునా భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 1980లో పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ, శ్యామ ప్రసాద్ ముఖర్జీ, అటల్ బిహారీ వాజ్ పాయ్ లాంటి మహోన్నత మైన మహనీయుల మార్గదర్శనంలో నడుస్తూ, ఈ దేశంలోని చిట్టచివరి వ్యక్తికి ప్రభుత్వ ఫలాలు అందించాలనే అంత్యోదయ లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఏకైక జాతీయ వాద, దేశభక్తి కలిగిన పార్టీ భారతీయ జనతా పార్టీ అని, ఈ పార్టీలో పనిచేస్తున్న కార్యకర్తలు అంతా కూడా గర్వంగా ముందుకు నడుస్తున్నారని, ఇదే స్ఫూర్తితో రాబోయే రోజులలో తెలంగాణ రాష్ట్రంలో సైతం బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, తెలంగాణ ప్రజలు రాష్ట్ర సాధన సమయంలో ఏవైతే కలలు కన్నారో గత 12 ఏళ్లుగా అవన్నీ అందించడంలో రెండు ప్రభుత్వాలు ఫెయిల్ అయ్యాయని అన్నారు. బిజెపితోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారనీ, అందుకే ఇటీవల జరుగుతున్న అన్ని ఎన్నికల్లో బిజెపికి మంచి ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. ఇదే స్ఫూర్తితో కార్యకర్తల బలంతో నాయకులందరూ ముందుకు వెళ్లి వచ్చే వరంగల్ మేయర్ ఎన్నికల్లో బిజెపిని విజయతీరాలకు చేర్చుతామని సంకల్పంతో ముందుకు సాగుతా మన్నారు. మాతృభూమి సేవ, సమర్పణ భావమే బీజేపీ పార్టీ సిద్ధాంతం అని, అంత్యోదయలక్ష్యంగా సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్' స్ఫూర్తితో వికసిత్ భారత్ సాధనకై ఈ ప్రయాణం ఇలాగే అప్రతిహతంగా కొనసాగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జలగం రంజిత్ రావు, రక్తం సతీష్ షా, ఉమ్మడి జిల్లా మాజీ జిల్లా అధ్యక్షులు ఎడ్ల అశోక్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, రాష్ట్ర నాయకులు మల్లాడి తిరుపతిరెడ్డి, బైరి మురళీకృష్ణ, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి, మార్టిన్ లూథర్ మరియు జిల్లా పదాధికారులు, నాయకులు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం :ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు

- **ఏనుమాముల మార్కెట్ యార్డ్, పర్వతగిరి, ఏనుగల్లు లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే**





**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 6 (నేటి దర్శిని బ్యూరో):** రైతు కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరచడం పంటలకు సరైన ధర కల్పించడం, వ్యవసాయానికి అనుకూల విధానాలు అమలు చేయడం ద్వారా రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ పేర్కొన్నారు. వరంగల్ జిల్లా మార్క్‌ఫెడ్ సహకారంతో సోమవారం వరంగల్ నగరంలోని ఎనుమాముల మార్కెట్ యార్డులో, వరంగల్ జిల్లా పర్వతగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో, ఏనుగల్లు గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే నాగరాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం రైతుల పట్ల అనుకూల దృక్పథంతో పని చేస్తోందని తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూరైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించాలని సూచించారు. ఈ కేంద్రాల్లో మొక్కజొన్నకు క్వింటాల్‌కు రూ.2400 కనీస మద్దతు ధర లభిస్తుందని చెప్పారు.రైతులు ఎలాంటి అనుమానాలు లేకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు తమ పంటను తీసుకురావాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పంట తూకం, చెల్లింపులు, ఇతర ప్రక్రియలు పారదర్శకంగా, వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.రైతులకు ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు మద్దతుగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, స్థానిక ప్రజాప్రతినిధులు, మార్క్‌ఫెడ్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# పట్టుదలతో కాకతీయుల శిల్ప కళా వైభవానికి పునర్జీవం: వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

- **పలుమార్లు కేంద్ర మంత్రిని కలిసి విజ్ఞప్తి చేసిన ఎంపీ డా. కడియం కావ్య**
- **వేయి స్తంభాల ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన పురావస్తు శాఖ**
- **కేంద్ర మంత్రికి, పురావస్తు శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేసిన వరంగల్ ఎంపీ**



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 6 (నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మరో కీలక మైలురాయిని సాధించారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన హనుమకొండలోని రుద్రేశ్వర స్వామి వేయి స్తంభాల గుడి అభివృద్ధి కోసం కేంద్రం నుంచి భారీ నిధులు మంజూరు కావడంలో ఎంపీ డా.కడియం కావ్య కృషి ఫలించింది.వేయి స్తంభాల ఆలయం, అదే ప్రాంగణంలోని కల్యాణ మండపం అభివృద్ధి, విస్తరణతో పాటు మిగిలిపోయిన పునరుద్ధరణ పనుల కోసం రూ.14.44 కోట్ల నిధులు మంజూరు చేయించడంలో ఎంపీ కడియం కావ్య కీలక పాత్ర పోషించారు. ఈ నిధులతో కాకతీయుల కాలం నాటి శిల్ప వైభవాన్ని తిరిగి తీసుకురావడమే లక్ష్యంగా పనులు చేపట్టనున్నారు.గతంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ను పలుమార్లు కలిసి, వేయి స్తంభాల గుడి అభివృద్ధి అవసరాన్ని వివరిస్తూ ఎంపీ చేసిన నిరంతర ప్రయత్నాలే ఈ ఫలితానికి కారణం అయ్యాయని పేర్కొన్నారు.గతంలో పురావస్తు శాఖ అధికారులతో కలసి స్వయంగా ఆలయాన్ని సందర్శించి, పునరుద్ధరణ అవసరాలను అధ్యయనం చేసిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వెంటనే కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించారు.ఇటీవల కేంద్ర పురావస్తు శాఖ పనులకు టెండర్లు పిలవడంతో పనులు ప్రారంభానికి రంగం సిద్ధమైంది. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో పాటు పురావస్తు శాఖ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి, ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. గత ఏడాది కేంద్ర మంత్రిని కలసి సుమారు రూ.15 కోట్ల నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేసిన విషయం గుర్తు చేస్తూ, అందుకు సానుకూలంగా స్పందించిన కేంద్రం రూ.14.44 కోట్లు కేటాయించడం వరంగల్ అభివృద్ధికి శుభసూచకమని పేర్కొన్నారు. కాకతీయుల శిల్ప కళా సంపదకు ప్రతీకగా నిలిచిన వేయి స్తంభాల గుడి అభివృద్ధి ద్వారా పర్యాటక రంగం మరింతగా అభివృద్ధి చెందడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య అన్నారు.వారసత్వాన్ని కాపాడుతూ అభివృద్ధి అనే లక్ష్యంతో ముందుకు సాగుతూ వరంగల్ లో నూతన ప్రాజెక్టుల సాధన కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య కు పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.



DR. KADIYAM KAVYA
MBBS, MD
MEMBER OF PARLIAMENT
(LOK SABHA)
WARANGAL IC-399

MEMBER:
- Standing Committee on Health and Family Welfare
- Consultative Committee on Skill Development & Entrepreneurship
- National Assisted Reproductive Technology and Surrogacy Board
- Committee on Empowerment of Women

403-Narmada, MP Flats
Dr. B. D. Marg Area, New Delhi-110 001.
Constituency Address:
H. No. 2-7-1041/3, Road No. 2
Kanakadurga Colony, Waddepally
Hanamkonda- 506 370
Hanamkonda District Telangana.
E-mail: drkadiyamkavyampwgl@gmail.com
Mobile : 9885856065, 9499100399

**Lr.No.MP WGL(TG)/167/2025 Dated: 24-12-2025**

To,
The Director General,
Archaeological Survey of India,
Dharohar Bhawan 24, Tilak Marg
New Delhi – 110001.

Respected Sir,

Sub: **Request for sanction of ₹10 crores towards the Site Development of the Thousand Pillar Temple, Hanamkonda. – Reg.**

-oOo-

I wish to bring to your kind notice the need for undertaking site development works at the historic Thousand Pillar Temple, Hanamkonda, which stands as one of the most prominent heritage monuments in Telangana and attracts a large number of pilgrims and visitors throughout the year. The temple, known for its architectural magnificence and cultural importance, requires further development to enhance the overall visitor experience while preserving its heritage character.

The proposed works include **landscaping** within the temple complex to upgrade and beautify the environment, and **providing pathways** with dressed stones matching the architectural style of the monument to facilitate smooth movement of pilgrims and visitors. It is also proposed to take up facade **illumination of the temple structures** to highlight their intricate carvings and architectural grandeur, especially during evening hours. Further, concealed **underground layouts for electricity and water distribution** are planned to maintain the aesthetic appeal of the surroundings without disturbing the heritage structures. In addition, installation of **informative and directional signages** within the temple complex is suggested to guide visitors and provide better interpretation of the site. **Restoration and Improvement of the Koneru** is also proposed as part of the development works.


These works are essential for improving the amenities for visitors, promoting heritage tourism, and preserving the cultural significance of this iconic monument. I therefore request the Director General, ASI to kindly **sanction 10 Crores** for taking up the proposed developmental works at the earliest.

With kind regards,

Yours faithfully,

(Dr. KADIYAM KAVYA)

Copy to the Superintendent Archaeology, Archaeological Survey of India, Hyderabad Circle, Koti for information.



Government of India
Office of the Superintending Archaeologist
Archaeological Survey of India
Hyderabad Circle
Kendriya Sadan, II Block, 3rd Floor
Sultan Bazar, Hyderabad – 500 001
Ph: 040-24651012 circlehyderabad.asi@gov.in

F. No. VIPR/2025-26/M/ Date: 12 MAR 2026

To
The Director General
Archaeological Survey of India
Dharohar Bhawan
24, Tilak Marg, New Delhi – 110001

**KIND ATTENTION: DIRECTOR (CONSERVATION), ASI, NEW DELHI**

Sub: VIP Reference – Request for sanction of ₹10 crores towards the Site Development of the Thousand Pillar Temple, Hanamkonda – Reg.
Ref: Email received from the Director (Conservation), ASI, New Delhi on 29.01.2026.

Sir,

With reference to the subject cited above and with regard to the VIP reference raised by Dr. Kadiyam Kavya, Hon'ble Member of Parliament, Lok Sabha, Warangal IC-399 vide Lr. No. MP WGL (TG)/167/2025; Dated: 24-12-2025 towards sanction of funds for undertaking the Site Development of the Thousand Pillar Temple, Hanamkonda under the jurisdiction of ASI, Hyderabad Circle, it is to submit that the ASI, Hyderabad Circle has already taken up certain works such as reinstalling the central stone in the Kalyana Mandapa.

Further, a DPR has been prepared for the holistic development of the monument and the same has been submitted to the Director (Conservation) and the Director (Monuments) vide Letter No. TPT/GEN-CORRESP/2025-26/M/1118; Dated: 08.09.2025 (copy enclosed as Annexure – I). This office has also proposed certain works to be taken up in the Financial Year 2026-27 (details enclosed as Annexure – II).

Accordingly, the proposed works as mentioned in the attachment will be taken up during the next Financial Year 2026-27 following proper procedure after due approval is received from the Directorate, ASI, New Delhi.

This is for your kind information and consideration.

Encl: Annexure – I & II

Yours faithfully

12/03/26
(Dr. Nihildas. N)
Superintending Archaeologist
Archaeological Survey of India
HYDERABAD CIRCLE

Copy for kind information to:-
- The Regional Director (South), ASI, Bengaluru.

WWW.NETIDARSHINI.COM
RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక
సత్య శోధనే మా లక్ష్యం
www.epaper.netidarshini.com
మంగళవారం 7-4-2026

# ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మంత్రి కోమటి రెడ్డి

- నల్గొండలో బీజేపీ నిరసన సెగ: మంత్రి కోమటిరెడ్డి పై తీవ్ర విమర్శలు
- నాణ్యతలేని రోడ్డు నిర్మాణంపై ఆగ్రహం -- క్లాక్ టవర్ వద్ద దిష్టిబొమ్మ దహనం
- ఔటర్ రింగ్ రోడ్ పనులపై వివాదం మంత్రి వెంకటరెడ్డిపై బీజేపీ ఫైర్



**నల్గొండ, ఏప్రిల్06 (నేటి దర్శిని):** నల్గొండ జిల్లా కేంద్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వ్యతిరేకంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతమయ్యాయి. జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి నేతృత్వంలో క్లాక్ టవర్ సెంటర్ వద్ద మంత్రి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నల్గొండ ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణం వివాదాస్పదంగా మారిందని ఆరోపించారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా, నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపడుతున్నారని మండిపడ్డారు. నాణ్యతలేని మట్టిని ఉపయోగించడం వల్ల ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో రూ.565 కోట్లతో జాతీయ రహదారిని మంజూరు చేసినప్పటికీ, స్థానిక మంత్రి కమిషన్ల కోసం నాణ్యతలేని నిర్మాణానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. సుమారు రూ.540 కోట్లతో చేపడుతున్న ఈ బైపాస్ రోడ్డు పనుల్లో బంకమన్ను, చౌడు, నల్లరేగడి మట్టిని ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటివరకు రెండు లక్షల టిప్పర్ల మట్టిని వినియోగించారని, దాని విలువ సుమారు రూ.140 కోట్లకు చేరవచ్చని అంచనా వేశారు. చెరువులను కొల్లగొట్టి మట్టిని తవ్వడం పర్యావరణానికి హానికరమని ఆవేదన వ్యక్తం చేశారు. మట్టి మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని, రోడ్డు నిర్మాణాన్ని నాణ్యత ప్రమాణాలతో మళ్లీ చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే చెరువులను పునరుద్ధరించాలని సూచించారు. సంబంధిత అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఎం నల్గొండ జిల్లాను పర్యటించకపోతే తీవ్ర స్థాయిలో నిరసనలు చేపడతామని తెలిపారు.

# నాగోల్ సహ భావన టౌన్షిప్ లో ఘనంగా హిందూ సమ్మేళన కార్యక్రమం







**నాగోల్, ఏప్రిల్06 (నేటి దర్శిని):** నాగోల్ సహ భావన టౌన్షిప్ లోని సబ్ స్టేషన్ గ్రౌండ్ లో సహభావన సమాలోచన ఏ. బి.సి.డి బ్లాక్ ల కమిటీ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హిందూ సమ్మేళనం ఎంతో కనుల పండుగ నిర్వహించారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ ఆధ్యాత్మిక ప్రసంగికులు డాక్టర్ అనంత లక్ష్మి, సికింద్రాబాద్ ఇస్కాన్ ప్రెసిడెంట్ ఐసిసి ఇస్కాన్ చైర్మన్ డాక్టర్ సహదేవ దాస్, మాతృశ్రీ ఆర్గనైజేషన్ ఫౌండర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హార్ట్ ఫుల్ నెస్ స్కిల్ డెవలప్మెంట్ అరవింద్ కపట్కర్ పాల్గొని హిందూ సమ్మేళనంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ మొన్న ఉగాది తేదీనాడు అంటే 18 రోజులు ఈ కార్యక్రమాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో నగర సంకీర్తనలు, లలితా సహస్ర పారాయణం, భజనలు, హనుమాన్ చాలీసా పారాయణం పిల్లల్లో డిజిటల్ వైపు కాకుండా ఆధ్యాత్మికతపై దృష్టి మళ్లించడానికి అలాగే హిందూ మత గొప్పదనాన్ని విస్తరించే విధంగా ఇక్కడ నిర్వహించినట్లు తెలిపారు. ప్రతిరోజు 300 మందికి పైగా కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారని అన్నారు. 18వ రోజు ఆదివారం నాడు ముగింపు సందర్భంగా హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఇందులో దాదాపుగా 1,400 మందికి పైగా పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఇందులో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. సహకరించిన కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు సొంటి శివకుమార్, ట్రెజరర్ ఉప్పల నాగేష్, సెక్రటరీ చిన్నప్పరెడ్డి, కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు కళ్యాణ్ చక్రవర్తి, భాస్కర్, సుగుణాకర్, నగేష్, ముఖేష్, నాగేందర్, మునేందర్, తుకారం ఇతర సభ్యులు, అపార్ట్మెంట్ వాసులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రోక్లైన్ ట్రిప్పర్లతో ఇసుక మాఫియా దందా

- నాగార్జునసాగర్‌లో అక్రమాలపై భగత్ కుమార్ ఘాటు విమర్శలు
- రామడుగు--శ్రీనాధపురం వాగుల్లో యథేచ్ఛగా ఇసుక తవ్వకం
- గంజాయి, పేకాట, బెట్టింగ్‌లతో యువత దారితప్పుతున్నదని ఆందోళన
- అధికారుల నిర్లక్ష్యం పై మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే
- కాంగ్రెస్ పాలనలో అవినీతి పెరిగిందని ఆరోపణలు
- బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి పనులను గుర్తు చేసిన భగత్ కుమార్
- అక్రమాలను అరికట్టకపోతే ప్రజలే తీర్పు ఇస్తారన్న హెచ్చరిక
- ప్రజల తరపున పోరాటానికి సిద్ధమని బీఆర్ఎస్ నేతల ప్రకటన



**నాగార్జునసాగర్, ఏప్రిల్06 (నేటి దర్శిని):** నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఇసుక మాఫియా, గంజాయి, పేకాట, బెట్టింగ్ వంటి అక్రమ దందాలు విస్తృతంగా సాగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ తీవ్రంగా ఆరోపించారు. నందికొండ మున్సిపాలిటీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రామడుగు మరియు శ్రీనాధపురం వాగుల్లో ప్రోక్లైన్ యంత్రాల సహాయంతో ట్రిప్పర్లకు ఇసుక ఎత్తిపోస్తూ కోట్ల రూపాయల అక్రమార్జన జరుగుతోందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో యువత గంజాయి మత్తులో పడిపోతుండగా, స్థానిక నాయకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పేకాట, బెట్టింగ్ కేంద్రాలు బహిరంగంగా నడుస్తున్నప్పటికీ, చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని, మంత్రులు, ఎమ్మెల్యేలు పోటీపడి దోపిడీ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో నాగార్జునసాగర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేశామని, కమల నెహ్రూ ఆసుపత్రి వంటి ప్రజా సేవా కార్యక్రమాలు చేపట్టామని గుర్తుచేశారు. ప్రస్తుతం పరిస్థితి దుర్భరంగా మారిందని వ్యాఖ్యానించారు. అక్రమ దందాలను అరికట్టకపోతే ప్రజలే ఓటుతో బుద్ధి చెప్పి చరిత్రను తిరగరాస్తారని హెచ్చరించిన భగత్ కుమార్, అవసరమైతే బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజల తరపున పోరాటానికి దిగుతారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అనుముల మండల పార్టీ అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, చెన్ను సుందర్ రెడ్డి, హిరేకార్ రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

- తీదేడు గ్రామంలో పతాక ఆవిష్కరణ



**చింతపల్లి ఏప్రిల్ 6 నేటి దర్శిని ప్రతినిధి :** చింతపల్లి మండలం తీదేడు గ్రామంలో భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీజేపీ కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు సముద్రాల నగేష్ ఆధ్వర్యంలో బూత్ నంబర్లు 48, 49 వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ జాతీయవాదమే పార్టీకి పునాదిగా నిలుస్తుందని, వ్యక్తి కంటే పార్టీ, పార్టీ కంటే దేశమే ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్, మాజీ ఉపసర్పంచ్ ధరణిపతి రమణారావు, వార్డు సభ్యులు మర్ల యాదగిరి, బొడ్డు ఆంజనేయులు, కొరివి యాదగిరి, రాశిక వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవం రథోత్సవంలో ఎమ్మెల్యే బాలు నాయక్



**చింతపల్లి ఏప్రిల్ 6 నేటి దర్శిని ప్రతినిధి :** చింతపల్లి మండలం మదనాపురం గ్రామంలో సాగర్ రోడ్డుపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నిర్వహించిన బ్రహ్మోత్సవం, రథోత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. దేవాలయ కమిటీ ఆహ్వానం మేరకు దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే స్వామివారి ఆశీర్వాదం పొందారు. గ్రామాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కృషి కొనసాగుతుందని ఆయన తెలిపారు.

# మోహన్ నగర్ లో 47వ బిజెపి ఆవిర్భావ దినోత్సవం



**కొత్తపేట, ఏప్రిల్06 (నేటి దర్శిని):** కొత్తపేట డివిజన్ పరిధిలోని మోహన్ నగర్ చౌరస్తాలో 47వ బీజేపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం డివిజన్ అధ్యక్షులు మంచి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో బిజెపి ప్రధాన కార్యదర్శి గట్టు మహేష్ కుమార్ గారి పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు మంచి రాజేష్ కుమార్ బిజెపి జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ నాయకోటి పవన్ కుమార్ హాజరయ్యారు. నాయకోటి పవన్ కుమార్, డివిజన్ అధ్యక్షులు రాజేష్ కుమార్ గారు పార్టీ అభివృద్ధి, సిద్ధాంతాలు మరియు ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యాలపై ప్రసంగిస్తూ కార్యకర్తలకు మార్గనిర్దేశనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, డివిజన్ స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న కూడా చైర్మన్




**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 6 (నేటి దర్శిని బ్యూరో):**
వరంగల్ నగరంలోని ప్రసిద్ధి చెందిన శ్రీ భద్రకాళి దేవాలయాన్ని కూడా చైర్మన్ , హనుమకొండ డిసిసి అధ్యక్షుడు ఇనగాల వెంకటరామిరెడ్డి , తన సతీమణి అవంతితో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు .ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అధికారులు చైర్మన్ దంపతులకు స్వాగతం పలికారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలు అంద జేసి, ఆశీర్వచనాలు ఇచ్చారు.

## ప్రజల ఆరోగ్య రక్షణకు అవగాహన అవసరం: ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 6 (నేటి దర్శిని బ్యూరో):**
ప్రజల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల పై అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ,జిల్లా ఫుడ్ సేఫ్టీ శాఖ ఆధ్వర్యంలో ఆహార భద్రత పై ప్రత్యేక దినం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల ఆరోగ్య రక్షణకు దోహద పడుతాయని ఆయన తెలిపారు. పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు నని ఎమ్మెల్యే సూచించారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీనీ ఎమ్మెల్యే జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరంగల్ నగరంలోని సిద్దేశ్వరాలయ పరిసరాల్లో నెమల్ల నాట్యం.....!



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 6 (:నేటి దర్శిని బ్యూరో)**
వరంగల్ నగరంలోని పద్మాక్షి గుట్ట సమీపంలోని సిద్దేశ్వరాలయ పరిసరాల్లో నెమళ్లు సూర్యోదయ వేల ప్రకృతి ఒడిలో నాట్యం చేస్తున్నాయి. ఉదయాన్నే పచ్చని ప్రకృతి మధ్య నెమళ్లు పించం విప్పి నాట్యం చేస్తూ భక్తులను కనువిందు చేస్తున్నాయి. ఈ అద్భుత దృశ్యం దేవాలయ ప్రాంతంలో ఆధ్యాత్మిక శోభను , హాల్లాదాన్ని కలిగిస్తుంది. దైవ దర్శనం కోసం దేవాలయానికి వచ్చిన భక్తులు నెమళ్లను చూడటానికి సంతోషపడుతున్నారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## ఉమ్మడి వరంగల్ జిల్లా బస్ డిపోలు మహాలక్ష్మి పథకం ద్వారా 22 కోట్ల మహిళలకు ఉచిత టిక్కెట్లు.....!




**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 6 (నేటి దర్శిని బ్యూరో):**
ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని బస్సు డిపోల ద్వారా తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా22 కోట్లకు పైగా మహిళలకు ఉచిత టికెట్లు జారీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. వరంగల్ 1 డిపో ద్వారా 1. 9 3, వరంగల్ 2 డిపో ద్వారా 1.90, హనుమకొండ డిపో ద్వారా4. 47, తొర్రూర్ డిపో ద్వారా 2.00, పరకాల డిపో ద్వారా 2,10, జనగామ డిపో ద్వారా3.24, మహబూబాబాద్ డిపో ద్వారా1.97, నర్సంపేట డిపో ద్వారా 2.49, భూపాలపల్లి డిపో ద్వారా1.98 కోట్ల మహిళలు ప్రయాణించారని 100 శాతం ఆక్యుపియన్సీ రేషియో అధిగమించామని ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

## యువత స్వశక్తితో ఎదగాలి

### - సర్పంచ్ చెన్నమ్మ లాలయ్య

**చింతపల్లి మండలం, ఏప్రిల్ 6 నేటి దర్శిని ప్రతినిధి :**
చింతపల్లి మండలంలోని కురుమేడు ఎక్స్ రోడ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన నిర్మల టెంట్ హౌస్, డీజే, ఫ్లవర్ డెకరేషన్ కేంద్రాన్ని కురుమేడు సర్పంచ్ చెన్నమ్మ లాలయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ యువత స్వశక్తితో ముందుకు వచ్చి స్వయం ఉపాధి ద్వారా ఎదగాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి వ్యాపారాలు ప్రారంభించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. నిర్మల టెంట్ హౌస్ ద్వారా వివాహాలు, శుభకార్యాలకు అవసరమైన టెంట్లు, కుర్చీలు, ఫ్లవర్ డెకరేషన్, డీజే వంటి సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ




కార్యక్రమానికి హాజరైన ప్రముఖులను టెంట్ హౌస్ యాజమానులు చింటూ, బన్నీ శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనంతల పవన్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు ఉప్పు శ్రీశైలం, కుంభం శ్వేత, శ్రీశైలం గౌడ్, చిక్కొండ సాయిరాం, గౌని రమేష్, వార్డు సభ్యులు కురుమేటి తరుణ్, కురుమేటి వెంకటేష్, నాదిరి సత్యనారాయణ,




గజ్జ అనిల్, శ్రీశైలం యాదవ్, ఏకుల శ్రీరాములు తదితరులు, గ్రామ ప్రజలు, యువత పాల్గొన్నారు.

# సిరిపురంలో అక్రమ కంకర క్రషర్‌పై రైతుల ముట్టడి


- “సిరి మెటల్ ప్రాడక్ట్స్” రద్దు చేయాలి... రైతాంగం డిమాండ్
- పంటలకు నష్టం... కంకర క్రషర్‌కు వ్యతిరేకంగా అఖిలపక్షాల పోరాటం
- పోల్యూషన్ భయంతో రైతుల ఆందోళన... తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా
- పబ్లిక్ హియరింగ్ లేకుండానే క్రషర్ ఏర్పాటా? రైతుల ఆగ్రహం



**రామన్నపేట, ఏప్రిల్ 6 (నేటి దర్శిని):**
యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలో అక్రమంగా ఏర్పాటు చేసిన “సిరి మెటల్ ప్రొడక్ట్స్” కంకర క్రషర్‌ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ రైతులు, అఖిలపక్షాల నాయకులు తహసిల్దార్ కార్యాలయం ముందు సోమవారం ముట్టడి నిర్వహించారు. ప్రజా పోరాట సమితి (పీఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకట్ స్వామి, బీజేపీ నాయకులు ఏళ్ల సంజీవరెడ్డి, సిపిఎం నాయకులు బడుగు రమేష్, బిఆర్ఎస్ నాయకులు పున్న వెంకటేశం తదితరులు రైతులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టపరమైన అనుమతులు లేకుండా కంకర క్రషర్ ఏర్పాటు చేయడం వల్ల గ్రామంలో తీవ్ర కాలుష్యం పెరిగిందని ఆరోపించారు. క్రషర్ నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళి కారణంగా సుమారు 50 రైతు కుటుంబాలకు చెందిన 300 ఎకరాల పంట భూములు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. పంటల దిగుబడి తగ్గిపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. అలాగే, పోల్యూషన్ కంట్రోల్ బోర్డు పబ్లిక్ హియరింగ్ నిర్వహించకుండా ప్రజాభిప్రాయం సేకరించకుండానే ఈ క్రషర్‌ను ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధమని నాయకులు మండిపడ్డారు. స్థానిక ప్రజల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా పరిశ్రమను నడపడం అన్యాయమని అన్నారు. కంకర క్రషర్‌ను వెంటనే రద్దు చేసి రైతాంగాన్ని రక్షించాలని, లేకపోతే తమ పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని అఖిలపక్షాల నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌పీఎస్ జిల్లా నాయకులు గాదె ఎల్లేష్, గ్రామ ఉపసర్పంచ్ మూడుదుడ్ల అనూష రమేష్, బీజేపీ గ్రామ అధ్యక్షులు సత్యనారాయణ, సిపిఎం నాయకులు బల్గూరి అంజయ్యతో పాటు పలువురు రైతులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


# ఉప్పల్ బాగాయతులో కమర్షియల్ నిర్మాణాలు





- ఉప్పల్ ఉప కమిషనర్ కు ఫిర్యాదు చేసిన పట్టించుకోరా
- ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు
- ఉప్పల్ భాగవత్ లో నిర్మాణాలకు అనుమతులు ఉండవా?
- చేంజ్ మాన్ లకు, నాక్ ఇంజనీర్లకు ఫిర్యాదు చేసిన పట్టించుకోరా
- టౌన్ ప్లానింగ్ ఏసిపి సెక్షన్ ఆఫీసర్ క్షేత్రస్థాయిలో నిర్మాణాలపై చర్యలు

**ఉప్పల్,ఏప్రిల్06 (నేటి దర్శిని):**
ఉప్పల్ బాగా ఎత్తు 96,113, ప్లాట్ నెంబర్లలో భారీ కమర్షియల్ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఉప్పల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని క్షేత్రస్థాయిలో టౌన్ ప్లానింగ్ ఏసిపి టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ పర్యటించకుండా చైన్ మ్యాన్లు, నాక్ ఇంజనీర్ లు ఏది చెప్పినా సరే అని పని కానిస్తున్నారని క్షేత్రస్థాయిలో టౌన్ ప్లానింగ్ అధికారులు పర్యటించకుండా అక్రమ నిర్మాణాలకు, కమర్షియల్ నిర్మాణాలకు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న వాటిపై చర్యలు తీసుకోకుండా మౌనం వహిస్తున్నారని ఉప్పల్ ఉప కమిషనర్ రాజుకు ఫిర్యాదు చేసిన మౌనంగా ఉంటున్నారని కారణం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వానికి భారీగా గండి కొడుతూ అధికారులు తమకు తోచిన విధంగా అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేసిన దినపత్రికల్లో కథనాలు వచ్చిన డోంట్ కేర్ అన్నట్టు వాళ్లకి కావలసింది వాళ్లకు అందితే అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చిన అటు వంక కూడా చూడటం లేదని, వీరికి రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో అక్రమ నిర్మాణ లకు వత్తాసు పలుకుతున్నారని మాజీ కార్పొరేటర్లు టౌన్ ప్లానింగ్ అధికారులకు మేమున్నామని భరోసా ఇస్తూ అక్రమ నిర్మాణాలకు రాజకీయ నాయకులు టౌన్ ప్లానింగ్ అధికారులు కలసి నిర్మాణాలకు ప్రోత్సహిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పురపాలక శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న స్థానిక రాజకీయ నాయకుల అండదండలు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఉండడంతో అక్రమ నిర్మానులకు ఉప్పల్ సర్కిల్ అధికారులు వత్తాసు పలుకుతున్నారని వీటిపై అక్రమ నిర్మాణాలపై విచారణ చేపట్టి అధికారులపై చర్య తీసుకోవాలని స్థానికులు



కోరుతున్నారు. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలికే అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసు కోవాలని, అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన వాటికి విద్యుత్ మీటర్లు ఇవ్వకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అక్రమ నిర్మాణాలు చేపట్టే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని గ్రేటర్ మల్కాజిగిరిలో భారీ అక్రమ నిర్మాణాలు టౌన్ ప్లానింగ్ అధికారుల కన్ను సైకల్లో నిర్వహిస్తున్నారని పురపాలక శాఖామంత్రి పదేపదే టౌన్ ప్లానింగ్ అధికారులకు హెచ్చరించిన అధికారులు తమకు కావాల్సింది అందడంతో అక్రమ నిర్మాణాలకు వత్తాసు పడుతున్నారని జరగరాని సంఘటన జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మల్కాజి గిరి కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలికే రాజకీయ నాయకులపై టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# వారాణాసిలో మరో బాలీవుడ్ నటి ?




మహేష్ బాబు హీరోగా రూ. 1300 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న అడ్వెంచర్ ఎపిక్ 'వారణాసి'. ఈ చిత్రాన్ని రాజమౌళి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నారు. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా నటిస్తుండగా, ఆర్. మాధవన్ కూడా ఒక కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇక ఈ మూవీ పై రోజుకో ఆసక్తికర వార్త బయటకు వస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో వేసిన భారీ వారణాసి సెట్‌లో మహేష్ బాబు (రుద్ర), ప్రియాంక చోప్రా (మందాకిని)లపై కీలక సన్నివేశాలను రాజమౌళి చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్ ముగియగానే ఒక గ్రాండ్ సాంగ్ షూటింగ్ జరగనుందని, అందులో మహేష్ బాబు సరసన నటించేందుకు మరో బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌ను చిత్రబృందం సంప్రదించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రియాంక చోప్రా తన పాత్ర కోసం ఒక అదిరిపోయే డ్యాన్స్ నెంబర్ ఉండాలని కోరగా, ఈ స్పెషల్ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని సమాచారం. ఇక హాలీవుడ్ స్థాయి విజువల్స్ కోసం అంటార్కిటికా వంటి లొకేషన్లలో కూడా షూటింగ్ జరిపిన జక్కన్న, ఈ స్పెషల్ సాంగ్‌ను విజువల్ వండర్‌గా తీర్చిదిద్దబోతున్నారట. ఏప్రిల్ 7, 2027న ఉగాది కానుకగా విడుదల కాబోతున్న ఈ చిత్రం, భారతీయ సినిమా చరిత్రలో సరికొత్త రికార్డులను సృష్టించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.



# బ్లాక్ శారీలో పిచ్చెక్కిస్తున్న నభా

# 15 ఏళ్ల వయస్సులోనే డీప్‌ఫేక్ దెబ్బ...

## జాన్వీ కపూర్ భావోద్వేగ వ్యాఖ్యలు



అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలిగా సినీ రంగంలో అడుగుపెట్టిన జాన్వీ కపూర్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా కొనసాగుతోంది. బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటూనే, తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు 'పెద్ది' సినిమాతో సిద్ధమవుతోంది. అయితే తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న జాన్వీ తన జీవితంలో ఎదురైన ఒక చేదు అనుభవాన్ని వెల్లడించి అందరినీ ఆలోచనలో పడేసింది.జాన్వీ కపూర్ మాట్లాడుతూ, తాను కేవలం 15 ఏళ్ల వయసులోనే డీప్‌ఫేక్ టెక్నాలజీ కారణంగా ఒక విచిత్రమైన ఘటనను ఎదుర్కొన్నానని తెలిపింది. "అప్పుడు నేను స్కూల్‌లో చదువుకుంటున్నాను. ఒక రోజు నా ఫ్రెండ్ ఒక అశ్లీల వెబ్‌సైట్‌లో నా ఫోటో ఉందని చెప్పాడు. అది నిజానికి నా ఫోటో కాదు... డీప్‌ఫేక్ ద్వారా తయారు చేసిన ఫోటో" అని ఆమె చెప్పుకొచ్చింది. ఈ సంఘటన తనపై తీవ్ర ప్రభావం చూపిందని జాన్వీ వెల్లడించింది. "ఆ ఫోటో గురించి తెలిసినప్పుడు నేను చాలా షాక్‌కు గురయ్యాను. ఏమి చేయాలో అర్థం కాలేదు. ఆ సమయంలో నేను చాలా బాధపడ్డాను. అదే సమయంలో సోషల్ మీడియా లో నైతికత ఎంత తక్కువగా ఉందో నాకు అర్థమైంది" అని ఆమె తెలిపింది. అప్పుడే నేను గ్రహించాను... భవిష్యత్తులో కూడా ఇలాంటి విషయాలు ఎదురవుతాయని. అందుకే ఇప్పుడు ఇలాంటి డీప్‌ఫేక్ ఫోటోలు వచ్చినా వాటిని ఎక్కువగా పట్టించుకోను అని జాన్వీ కపూర్ స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో టెక్నాలజీ దుర్వినియోగం ఎలా వ్యక్తిగత జీవితాలను ప్రభావితం చేస్తుందో ఈ ఘటన మరోసారి చూపిస్తోంది. ముఖ్యంగా డీప్‌ఫేక్ వంటి టెక్నాలజీ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో, సెలబ్రిటీలే కాక సాధారణ ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే, జాన్వీ కపూర్ ప్రస్తుతం పలు సినిమాలతో బిజీగా ఉంది. తెలుగు చిత్రం 'పెద్ది'తో పాటు బాలీవుడ్‌లో కూడా వరుస ప్రాజెక్టులతో ఆమె కెరీర్ పీక్‌లో కొనసాగుతోంది.



# ప్రయోగాత్మక పాత్రలంటే ఇష్టం


'ఇందులో నేను చేసిన సరస్వతి పాత్ర చాలా డిఫికల్ట్. ఓ యాక్టర్‌కి ఛాలెంజింగ్ రోల్స్ చేయడం ఎప్పుడూ ఆనందంగానే ఉంటుంది. మేకర్స్ కూడా ఆ పాత్రను సులభంగా అర్థమయ్యేలా తీర్చిదిద్దారు. అందుకే ఎంజాయ్ చేస్తూ నటించా. ఇప్పటివరకూ నేను చేయని జానర్ ఇది. ఇందులో స్టంట్స్ చేశాను. చేజింగులు చేశాను. ఫిజికల్‌గా చాలా కష్టపడ్డా. తెరపై అందరికీ నచ్చుతాననే అనుకుంటున్నా' అని మృణాళ్ ఠాకూర్ అన్నారు. అడివి శేష్‌కు జోడీగా ఆమె నటించిన పానిండియా యాక్షన్ రొమాంటిక్ థ్రిల్లర్ 'డెకాయిట్'. షానియల్ డియో దర్శకుడు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఆదివారం మృణాళ్ విలేకరులతో ముచ్చటించింది.ఒక నటిగా ప్రయోగాత్మక పాత్రల్లో నటించడమంటే నాకిష్టం. అలాగే నాకు నేనే సర్‌ప్రైజ్ అవ్వడం ఇష్టం. అలాంటి అవకాశం ఈ పాత్ర ద్వారా వచ్చింది. ఈ కథ విన్నప్పుడు హరి(అడివి శేష్), సరస్వతి(మృణాళ్) ఎందుకు డెకాయిట్స్‌గా మారారు? అనేది చాలా ఆసక్తికరంగా అనిపించింది. ఒక డిఫరెంట్ లవ్‌స్టోరీ ఇది. ముఖ్యంగా అడివి శేష్ కోసం అంతా థియేటర్లకు వచ్చి ఈ సినిమా చూడాలని కోరుతున్నా. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. అద్భుతంగా నటించారు. అన్నీ దగ్గరుండి చూసుకున్నారు. తెలుగుతోపాటు హిందీలోనూ ఈ సినిమాను షూట్ చేశాం. ఏ భాషవారికైనా నచ్చే సినిమా ఇది. ప్రకాశ్‌రాజ్, అనురాగ్ కశ్యప్ వంటి లెజెండ్స్‌తో పనిచేయడం గొప్ప అనుభవం. ఇక దర్శకుడు షానియల్ దగ్గర్నుంచీ సాంకేతికంగా అందరూ అద్భుతంగా పనిచేశారు. కచ్చితంగా 'డెకాయిట్' అందరికీ నచ్చుతాడు' అన్నారు మృణాళ్‌ఠాకూర్.

# హీరోయిన్‌ను ఫైనల్ చేసిన అనిల్ రావిపూడి..



ఈ ఏడాది చిరంజీవి టైటిల్ రోల్‌లో నటించిన మన శంకర వరప్రసాద్ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్నాడు డైరెక్టర్ అనిల్ రావిపూడి. ఈ మూవీ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న అనిల్ రావిపూడి 2027 సంక్రాంతికి విక్టరీ వెంకటేశ్, నందమూరి కళ్యాణ్ రామ్ కాంబోను సెట్ చేశాడని తెలిసిందే. ఈ సినిమాలో హీరోయిన్లుగా ఎవరెవరు కనిపిస్తారనే దానిపై పలు వార్తలు ఇప్పటికే నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. తాజాగా దీనిపై క్లారిటీ ఇచ్చేశాడు అనిల్ రావిపూడి.ప్రదీప్ రంగనాథన్ నటించిన లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు వన్ ఆఫ్ ది గెస్ట్‌గా హాజరయ్యాడు అనిల్ రావిపూడి. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తన నెక్స్ట్ సినిమాలో కృతిశెట్టి వన్ ఆఫ్ ది ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తున్నట్టు తెలిపాడు. కృతిశెట్టి నందమూరి కళ్యాణ్ రామ్‌కు జోడీగా కనిపించబోతుందట. మరి వెంకటేశ్‌తో రొమాన్స్ చేయబోయేది ఎవరనేది సస్పెన్స్ నెలకొంది. షైన్ స్క్రీన్స్, జీ స్టూడియోస్ సంయుక్తంగా తెరకెక్కిస్తుండగా.. సురేశ్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. ఈ సంక్రాంతి ప్రాజెక్టుకు సంబంధించి పూర్తి వివరాలపై రాబోయే రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. ఇంతకీ ఈ ప్రాజెక్టు కోసం అనిల్ రావిపూడి ఎలాంటి కథను సిద్ధం చేశాడు. రెండో హీరోయిన్ ఎవరై ఉంటుందనే దానిపై ఏదైనా క్లారిటీ ఇస్తాడేమో చూడాలి.

# లవ్ ఇన్సూరెన్స్ ప్రేక్షకులకు నచ్చుతుంది: దిల్ రాజు



'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' అంటూ ప్రేక్షకులను కొత్త కాన్సెప్ట్ మూవీతో అలరించేందుకు సిద్ధమయ్యారు ప్రదీప్ రంగనాథన్, కృతిశెట్టి. వీరిద్దరూ జంటగా నటించిన ఈ చిత్రాన్ని విఘ్నేశ్ శివన్ తెరకెక్కించారు. నయనతార, ఎస్ఎస్ లలిత్ కుమార్ నిర్మించారు. ఈనెల 10న రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ వేడుకకు దిల్ రాజు, అనిల్ రావిపూడి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ.. ప్రదీప్ రంగనాథన్ నటించిన 'లవ్ టుడే' ప్రేక్షకులకు నచ్చుతుందని ముందే ఊహించినట్లు తెలిపారు. అందుకే తెలుగులో డబ్ చేయించినట్లు చెప్పారు.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365